

# అభాగిని

[కథానిక]

❀

శ్రీ చిలుకూరి శేషగిరిరావు

మా అమ్మమ్మకు జబ్బుగావుంది, రావల్సిందని వుత్తరం రాగానే — ఇంట్లో కల్లా నిరుద్యోగినీ, తీరుబడికలవాడినీ నేనొక్కణ్ణే మిగలటంచేత పెట్టే బేడా సర్దుకొని గుంటూరుకు ప్రయాణమైనాను. ఆమెకు అత్యంత వాత్సల్యపూరితుడైన నన్ను చూడగానే కొన ఊపిరితో నున్న ఆమె ప్రాణం స్వస్థానం చేరుకుంది. ఆమెకు వెన్నులో పెద్ద గడ్డ బయలుదేరి, లోలోపలే అది వృద్ధిపొందుతూ వుంది. ఎన్ని మందు లిప్పించినా తగ్గకపోవటంచేత హోమోపతీమందే యిస్తున్నారు.

ఆమెకు యింకా యీ భూమిమీద నాలుగురోజులపాటు బ్రతికివుండి గంజి తాగే ప్రాప్తి వుండటంచేతో, లేక ఆమెఅపూర్వ వాత్సల్యాన్ని చూరగొనేవాడును, జ్యేష్ఠమనుమడను నైన నా వివాహ మహోత్సవం చూచే అదృష్టం వుండటంచేతనో యమధర్మరాజుతో ఘోరసంగ్రామ మొనర్చి మృత్యుంజయురాలనే బిరుదు పొందింది. ఆమెకు నేను నడుము కట్టుకొని పథ్యము వండి పెడుతూవుండేవాణ్ణి.

గుంటూరులో మంచి కమ్మటి నెయ్యీ, తియ్యటి పెరుగూ, పసందైన తాజాకూరలూ దొరుకుతూవున్నా అందరికీ ముఖ్యంగా కావలసిన నీటివిషయంలో మాత్రం చాలా యిబ్బంది పడాలి. మునిసిపాలిటీవారు కుళాయిలైతే పెట్టించారుగాని అవి వుండికూడా నిరుపయోగ మనే చెప్పాలి. అవి రోజులో ఏ కొద్దికాలమో మాత్రమే తెరువబడి వుంటాయి. అందులోనూ ఒకపూట తెరుస్తే ఇక రెండవపూటకు ఆశ వుండదు. ఇక అందులోనుంచి పడే నీటిధార అయ్యరు హోటలులో చేతులు కడుక్కునే పైపుధారకంటే సన్నగానే వుంటుంది. ఇంకొక గంటకో, అరగంటకో పైపులు వదుల్తా రనంగానే జనం తండోపతండాలుగా — మనిషికి రెండుమూడు బిందెలకు తక్కువ లేకుండా తెచ్చుకుంటారు. అలా వచ్చిన సమూహంలో కుల-మత, ఆడ-మగ వివక్షత వుండదు. ఇక ముందు రాబోయే నీటికోసం నాబిందె ముందంటే నాబిందె ముందనీ, నేను ముందు వచ్చానంటే నేను ముందు వచ్చాననీ వాదించుకొంటూ, వొకరి బిందె వొకరు నెట్టుకుంటూ ఆర్భాటం చేస్తారు. అందులో కొందరు లంకాద్వీపవాసులూ, మరికొందరు కిష్కింధావాసులూ వుంటే ముందు నోరు పడేసుకుని, ఆ తరువాత చేతులు కలయజేసుకొని చిన్న రామరావణ సంగ్రామ రంగాన్ని ప్రదర్శిస్తారు. చివరికి నోటిదబాయింపూ, జవసత్వాలూ గలవారికే జయం లభిస్తుంది. ఈ పై రెండు తరగతులకూ చెందని నాలాంటి అమాయకులుంటే, వాళ్లంతా వెళ్లేవరకూ నిరీక్షిస్తూ వుంటారు. ఇంతలో ఆ పైపులకు సెలవియ్యంగానే— కాళ్లీడ్చుకుంటూ, భుజంమీద యిరవై బారల లంగరు త్రాటిని వేసుకొని రెండు ఫర్లాంగుల దూరంలో వున్న మంచినీటి బావులదగ్గరకు పోతారు.

ఈ పైపులు రాక పూర్వం నీటికరవు యింకా ఎక్కువగా వుండటంచేత కొందరు పుణ్యాత్ములు అక్కడక్కడా కొన్ని ధర్మనూతులు త్రవ్వించారు. కాని యివి చాలా లోతుగా వుంటాయి. అందులో

మేనెలలో నీరు పూర్తిగా అడుగంటిపోతాయి. కొన్ని కొన్ని నూతుల్లో అసలే తడి వుండదు. పైగా అంత కష్టపడి దూరపు నూతులకు వెడితే—తమకు అధమం యిరవై బారల తాడన్నా కట్నంగా యివ్వకపోతే వారితో వియ్యముండదని భీష్మించుకొని కూర్చుంటాయి నూతుల్లోని నీళ్లు. ముందుగా తమకు కొంచెం తైలసంస్కారం లేందే చేదను నూతిలోకి దింపనియ్యమని మొండికెత్తుతాయి నూతిగిలకలు— అప్పుయిప్పించే బ్రోకర్లు కమీషను ముందు గుంజుకునేట్టు. నిజంగా వేసవికాలంలో గుంటూరులో నీటికరవు ఎక్కువనే చెప్పాలి.

మా యింటికిమట్టుకు ఒక బ్రాహ్మణుడు పీపా బండిలోంచి తెచ్చిన నీటిని నాల్గుబిందెలు పోస్తాడు. కాని ఆ బండిలాగేవాడు బ్రాహ్మణేతరుడవటంచేత ఆ నీళ్లు మా అమ్మమ్మకు పనికిరానందున నేనే స్వయంగా నీళ్లు తేవాల్సివచ్చేది. మా యింటికి సమీపంలో వున్న నుయ్యి వట్టిపోవటంచేత అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో వున్న నూతికి వెళ్లవలసి వచ్చేది. ఎంత మండుటెండ కాచినా ఆ నూతిలో మాత్రం నిలువునీటికి కొరత వుండదు.

ఆ రోజు లైబ్రరీలో స్నేహితులు చాలా సేపు వుంచేయటంచేత యింటికి వచ్చేటప్పటికి బాగా ఆలస్యమైంది. ఇంటికి రాగానే తువాలు భుజంమీద వేసుకుని నాపరికరాలను పట్టుకుని నీటికోసం బయలుదేరాను. నేను ఆలస్యంగా వెళ్లటంచేత కాబోలు — ఆ నూతికి గల నాలుగు గిలకల్లోనూ ఒకటే పని చేస్తూవుంది. సుమారు పదిహేను రోజుల్నుంచీ అచ్చట నాకు కనిపించని ఒక నూతనముఖాన్ని నే నానాడు సందర్శింప గలిగాను.

ఆమెకు యిరవై రెండేళ్లుంటాయి. గట్టిగా గాలి వేస్తే ఎగిరిపోతుందేమో అనేటంత సన్నగానూ, నీరసంగానూ వుంది ఆ విగ్రహం. అందమైన కోల మొహం. విశాలమైన కన్నులు. తీర్చిదిద్దినట్లున్నాయి తదితర అవయవాలు. కేశసంరక్షణలో తగిన శ్రద్ధ చూపకుండటంచేత కురులు నలిగి స్వేచ్ఛగా ఆమె ముఖంమీద చిందులాడుతున్నాయి. ఆ నిండువెన్నెల్లో ఆమెముఖంలో విచారమూ, వైరాగ్యమూ నాకు గోచరించాయి. ఆ బలువైన రెప్పల్లో సగమువరకూ మూసుకున్న నేత్రాలలోని దీనత్వము నా హృదయంలో ప్రతిఫలించింది. బడికి వెళ్ల నిష్టపడక మారాము చేసే బండబాలునివలె నూతిలోని చేద అతిప్రయాసమీద పైకి వస్తూ వుంది. ఆమె తన్ను బాధపెడుతూవుందని మొఱ పెడుతూవున్నట్లుగా గిలక వుండివుండి కిర్రు కిర్రుమంటూవుంది. ఆమె చేదను త్వరితముగా లాగలేక చాలా ప్రయాసపడుతూవుంది. అప్పుడప్పుడు పేగులు తెగిపోయేటంత గట్టిగా దగ్గుతూవుంది.

మంచివయసులో వున్నవాణ్ణి నేనే నూతులోంచి చేదను పైకి లాగటానికి రెండు నిముషాలు తీసుకొంటూ వుండేవాణ్ణి. అలాంటప్పుడు అంత పేలగా వున్న ఆయువతి తన శక్తికి మించిన బలువు గల చేదను ఎంతసేపటిలో లాగగలుగుతుంది? అలా తోడుతూ వుంటే ఆమెబిందె నిండే దెప్పుడు?— అనే తలపు కలిగినంతనే నాకామెమీద జాలివేసింది. ఆమె మధ్యమధ్య ఆయాసంతో దగ్గుతూవుండటం చూచి, ఆ దేహదారుఢ్యానికి తోడు ఏదో వ్యాధితో కూడా బాధపడుతూవున్నదికదా అని గ్రహించి విచారపడ్డాను. అట్టి నీరసురాలిని— అందులోనూ వ్యాధిగ్రస్తను— అంత పెద్దబిందెతో నీళ్లు మొయ్యమని శాసించిన ఆ మూర్ఖుడైన భర్తపై అమితమైన ఆగ్రహం కలిగింది.

ఆమెమొహంలో వొకవిధమైన ఆకర్షణశక్తి వుంది. అందుచేత ఆమెమొహాన్ని ఎంతసేపు చూచినా తనివి తీరటంలేదు. పాపం, ఆమె అంత అసహాయస్థితిలో వుండగా పురుషుణ్ణయిన నేను చూస్తూ వూరకుండ లేకపోయాను. కాని ఆమెను ఏమని పల్కరించాలో! ఒకవేళ నేను మంచి ఉద్దేశంతో మాట్లాడినప్పటికీ ఆమె దురభిప్రాయపడితే?—సాహసించాను.

“ఏమండీ! మీ రంత నీరసంతో ఎన్ని చేదలని లాగగలరు? నేను సాయపడటానికి అభ్యంతరం చెప్పకండి” అనేశాను తడబడుతూ. కాని ఆమె ఏమంటుందో అనే భయంతో హృదయం కంపిస్తూనేవుంది.

ఆమె బలువైన రెప్పలలోంచి కన్నులు తెరచి నావైపు పరిశీలనాదృష్టితో చూచింది. ఒక చిన్న మందహాసం ఆమెమొహంలో ఒకక్షణమాత్రం మెరసి మాయమైంది.

"తమ్ముడూ! ఇన్నాళ్లకు నీ వొక్కడి నోటి నుండి వెడలిన యీసానుభూతివాక్యం నా హృదయాని కెంతో ఆనందా న్నిస్తూవుంది. కాని, ఇన్నాళ్లూ ఒకళ్లకు సేవచేసే బానిసత్వానికి అలవడ్డ యీ శరీరానికి యిప్పుడు నీనుంచి ఎలాటి సాయమూ అవసరం లేదు" అని ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచింది.

"తమ్ముడూ!" అని ఎంతో ఆదరంతో కూడుకొని, మధురంగా నాచెవిలోనికి జొరబడ్డ ఆ అమృత వాక్కు నాశరీరంలోని సర్వావయవాలకూ వ్యాపించి నేను పరవశుణ్ణయినాను. ఎంత మధురమైన వాక్కు! అంతకు నాలుగేండ్లకు ముందు చనిపోయిన మాఅక్క జ్ఞప్తికి వచ్చింది. ఆమెకు నాయందు గల వాత్సల్యం చివరకు మా అమ్మకుకూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పు డీమె "తమ్ముడూ!" అని సంబోధించగానే ఆమాటలోని అనురాగమూ, స్వరమూ కేవలం మా అక్కయ్యదే ననిపించింది. నా కన్నులు చెమ్మగిల్లినాయి. వణుకుతూవున్న కంఠంతో "అక్కయ్యా! నీ తమ్ముణ్ణయిన నా సాయం నీకు తగదా?" అని ప్రశ్నించాను.

ఆమె తలను పైకెత్తి కృతజ్ఞతతో నావైపు చూచింది. ఆవెన్నెల్లో ఆమెకళ్లలోని నీరు మెరుస్తున్నది.

"తమ్ముడూ! ప్రపంచంలో నేటివరకూ నో రారా 'తమ్ముడూ' అని పిలుచుకునే భాగ్యం లేకపోయిం దనుకుంటూ వుంటే నేడు నువ్వు నా కా లోటును తీర్చావు. నేడు నువ్వు 'అక్కయ్యా!' అని ఎంతో అనురాగపూరితంగా పిలిచిన ఆ మధురవాక్యం ఇన్నాళ్లనుంచీ నాశరీరంలో జీర్ణించుకునిపోయిన కష్టాన్నంతా మరిపించేసింది. నువ్వు నాయందలి అభిమానంచేత ఇవ్వాళా, రేపూ సాయంచేయగలవుగాని యావజ్జీవం నాలోని రక్తమాంసాలను బానిసత్వానికి ధారపోయవలసిన నా కదెంతవరకు వుపకరిస్తుందో గ్రహించావా?"

ఆ మాట వెలువడేసరికి ఆమెఅధరం కంపిస్తూ వుంది. అంతవరకూ రెప్పల్లో యిమిడివున్న బిందువులు చెక్కులపై జలజలమని దొరలినవి.

ఆమెకూ నాకూ హఠాత్తుగా కలిగిన యీ బాంధవ్యం నాహృదయాన్ని ఆనందంలో ముంచెత్తుతూవుంది. ఆమె నిరాశాపూరిత వాక్యాలు వింటూ వుంటే నామనస్సు కలతపడుతూవుంది. వెంటనే ఆమె వారిస్తున్నా, చేదను ఆమెచేతుల్లోంచి లాక్కుని "అక్కయ్యా! యీ విషయంలో నువ్వు పట్టు పట్టకు. నాకూ నీలాంటి అక్కయ్యే వుండేది. నేనంటే ఎంతో ప్రాణంగా వుండేది. ఆమె ఎంత వారిస్తున్నా, గృహకృత్యాల్లో ఆమెకు సాయపడటం మానేవాణ్ణి కాను. నా దురదృష్టంకొద్దీ నాలుగేండ్ల క్రితమే ఆమె చనిపోయింది. దైవవశాత్తూ నేడు నీ దర్శనమైంది. చనిపోయిన అక్కయ్యే నీయందు మూర్తీభవించిం దనే విశ్వాసం నాకు దృఢంగా వుంది. నేను యిక్కడ ఎలాగూ రెండునెలలవరకూ వుండాలి. అంతవరకూ ప్రతిరోజూ నీకు నేను సాయంచేస్తూవుంటాను. ఇలా చేస్తే చనిపోయిన మా అక్కయ్య ఋణాన్ని కొంత వరకన్నా తీర్చినవాణ్ణవుతా" నని, నీళ్లు తోడుతూ, నా వృత్తాంత మంతా చెప్పాను.

పదినిముషాల్లో బిందెను నీళ్లతో నింపేశాను. "అమ్మా! యింకన్ని బిందెలు కావాలె?" అని అడిగాను.

"బాబూ! ఒకటీ, రెండూ బిందెలతో తెమలదు. అథమం ఎనిమిది బిందెలన్నా వుండాలి. రోజుకు నాలుగుబిందెలు త్రాగటానికీ వంటకూ సరిపోతాయి. మిగిలిన నీళ్లు మా అత్తగారికీ, నాచెల్లెలికీ స్నానానికి సరిపోతాయి."

"అదేమిటమ్మా! స్నానానిక్కూడా మంచి నీళ్లే కావాలా? అయితే నా కింకొక చెల్లెలు వుందన్న మాట" అన్నాను ఆశ్చర్యంతో.

"అదంతా నీకు అర్థం అవదు తమ్ముడూ! బాగా చదువుకున్న విదుషీమణులకు స్నానానికి

మంచినీళ్లే కావాలి. ఆ గాథంతా సావకాశంగా చెప్పాలి. ఇప్పటికే ఆలస్య మైంది" అనంగానే బిందెను ఆమెభుజంమీదకు ఎత్తాను. ఆమె ఆ నీరస దేహా న్నీడ్చుకుంటూ వెళ్లింది.

ఆమెఆఖరుమాట వినగానే నా మెదడులో అనేక ఆలోచనలు బయల్దేరాయి. ఆమె అంత నీరసంగా, దీనంగా కనిపించటానికి ప్రబలమైన కారణం ఏదో ఉం దనిపించింది. చదువుకున్న ఆడాళ్లయితే మాత్రం స్నానానికి మంచినీళ్లే కావాలా, ఆమె చెప్పవలసిన గాథ అంత పెద్దదా అనుకుంటూ, మబ్బులలో దాగుడుమూత లాడుతూవున్న చంద్రుడికేసి చూస్తూ కూర్చున్నాను. ఆమె పదినిముషాలకు మళ్లీ వచ్చింది. అదివరకే నాబిందెలో నిండుకొనివున్న నీటిని ఆమె బిందెలో వొంపి, "ఏమమ్మా! యింత ఆలస్యమైం" దని అడిగాను.

ఆమె బిందెఅంచులవరకూ నిండిన నీటిని క్రిందకు నెట్టుతూ "బాబూ! ఆ గుడి అవతల వీథి చివర నున్నదే అదిగో అదీ మాయిల్లు. వెళ్లి రావట మంటే ఈమాత్రం ఆలస్యం పట్టదూ!" అంటూ, బిందెను నా సాయంతో భుజంమీద పెట్టుకొని వెళ్లిపోయింది.

ఆమె మళ్లీ వచ్చేలోగా బిందెనిండా నీళ్లుతోడి ఆమెరాకకోసం ఎదురు చూస్తున్నాను. ఇలా ఒక గంటలో ఆమెకు కావలసిన నీళ్లు తోడంగానే ఆమె కృతజ్ఞతను తెల్పి వెళ్లిపోయింది. నేను నా బిందెతో యిల్లు చేరుకున్నాను.

మరునాడు అదే వేళకు నూతికి చేరుకొన్నాను. ఆమె వచ్చినవెంటనే చేదను అందుకుని నూతిలోనికి దింపుతూ "అక్కయ్యా! నిన్న ని న్నెన్నో ప్రశ్నలు వేద్దా మనుకున్నాను. కాని నీకు ఆలస్య మైపోతుందని మానేశాను. ఇవ్వాళన్నా నీ సంగతంతా చెబుతావన్న ఆశతో నిరీక్షిస్తూ వున్నాను. నీమొహం చూడగానే నువ్వేదో దారుణ మనోవ్యథతో కృశిస్తూ వున్నట్టు గ్రహించాను. నీ తమ్ముణ్ణయిన నావద్ద ఏవిషయమూ దాచకండా పూర్తిగా చెప్పాలని వేడుకుంటున్నా" నని ఆమెవంక కుతూహలంతో చూస్తూ చెప్పాను.

అప్పు డామె దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, గాలికి కండ్లను కప్పతూవున్నకురుల్ని చెవులపైకి తప్పించి, తన గాథ యిలా చెప్పింది.

"తమ్ముడూ! తెలివైనవాడివి గనుక నా హృదయంలో చిరకాలంనుంచీ అణిగివున్న బాధను గ్రహించావు. నా అనుగుతమ్ముడవైన నీవద్ద దాపరిక మెందుకు? కాపరానికి వచ్చిననాటినుంచే నేను సంసారంలోని కష్టపరంపరలను ఎదుర్కొనవలసి వచ్చింది. పదునాలుగేండ్లు నా తలిదండ్రులచేత అల్లారుముద్దుగా పెంచబడిన నాలోని సుకుమారము, మార్దవము, ఆనందము అంతా యీయింటికి వచ్చినమరునాడే నశించిపోయాయి. ఆనాటినుంచీ నాహృదయంలో పరితాపానలం రగుల్కొని నానాటికీ విజృంభిస్తూవుంది. తమ్ముడూ! నా హృదయంలో ఎనిమిదేళ్లనుంచీ వృద్ధిపొందుతూవున్న ఆ పరితాపానలం నా చరిత్ర నీతో కొంత వెళ్లబోసుకుంటే తగ్గుతుందేమో అనే విశ్వాసంతో నాయావద్వృత్తాంతమూ చెప్పేస్తున్నాను.

"మా తల్లిదండ్రులకు లేక లేక చాలా కాలానికి పుట్టిన ఏకసంతాన మవటంచేత నేను అల్లారుముద్దుగా పెరిగాను. తమ ఏకసంతానాన్ని ఏభాగ్యవంతుల యింట్లోనన్నా పడేస్తే సకలభోగాల్నీ అనుభవిస్తుం దనే వెర్రి ఆశతో, వెదకి వెదకి చివరకు యీవూరి సంబంధం నిశ్చయించారు. ప్రస్తుతం కట్నం అడక్కపోతే తమ తదనంతరం తమకు గల ఆరు ఎకరాల భూమినీ, పెంకుటింటినీ పిల్లపేర ముట్ట జెబుతామన్నారు. కాని మా అత్తగారు ముందుగా రెండువేలూ చేతులో పోస్తేగాని వీలులేదని పట్టుపట్టటంచేత ఆరుఎకరాలభూమినీ మూడువేలకు అమ్మి పెళ్లిచేశారు. తనకు ఆడుసంతతి లేకపోవటంచేత వాళ్ల వాటాకూడా కలిపి వియ్యపురాలి లాంఛనాలక్రింద తనకు అయిదువందలు రావాలని మాఅత్తగారు పేచీ పెట్టింది. అప్పటికి రెండువందలుమాత్రం ముట్టజెప్పి ఎలాగో వివాహం అయిం దనిపించారు. ఇక కార్యానికి డబ్బులేక యిల్లు తణఖా పెట్టారు. కాని మా అత్తగారి ఋణం తీర్చటానికి మాత్రం అసమర్థులయారు.

“నేను కాపరానికి వచ్చిన రెండుమూడు నెలల వరకూ మా అత్తగారు తన డబ్బుకోసం పేచీ పెట్టింది. మావాళ్ల అసమర్థత తెలుసుకుని నన్ను పుట్టింటికి తోలేసి కొడుక్కు రెండోపెళ్లి చేస్తానని పట్టు పట్టింది. మా మామగారి కింకా హృదయమంటూ వుండటంచేత అలా చేయటం అన్యాయమని మందలించారు. ఆనాటినుంచే ఆమెహృదయంలో నాపై యీర్ష్యాగ్ని రగుల్కొని నానాటికీ ప్రజ్వగిల్లుతూ వుంది. తండ్రి కొడుకులిద్దరూ స్వతహాగా మంచి వాళ్లయినా ఆమెచేతిలోని కీలుబొమ్మలైనారు. కారణం? ఆస్తంతా ఆమెస్వాధీనంలో వుంది. చివరకు మామగారి చుట్టల దగ్గర్నుంచీ ఆమే కొనియివ్వాలి. అందుచేత వారు ఆమెఆజ్ఞను జవదాట లేకపోయారు. ప్రతినిత్యమూ, మావాళ్లు తన్ను మోసంచేశారని ఈర్ష్యతో సూటిపోటు మాటలతో నన్ను వేధించని నిముష ముండదు. నా తల్లిదండ్రులు తీర్చవలసిన ఋణాన్ని నేను తీర్చవలెనని యింటి దాసీదాన్ని మాన్పించి అన్నిపనులూ నాచేతనే చేయించటానికి మొదలుపెట్టింది.

“బాబూ! ఏంచేయను? నా విధిలిఖితం యిలా వుందనుకుని కిక్కురు మనకుండా ఆమె చెప్పిన పనులన్నీ చేస్తుండేదాన్ని. నన్నింత బాధపెడుతున్నా ఆమెకు కసితీరలేదు. నా హృదయాన్ని వేధించి మలమల మాడ్చివేయాలని నిశ్చయించుకుంది. తనయింట్లో అంట్లుతోమే దాసీముండ తన కొడుకుకు భార్యగా ఉండుటకు తగదనీ, తన భాగ్యంతో సరితూగగల సంబంధమే తాను చేసుకోవాలనీ ఇంకొక ధనవంతుల పిల్లను కొడుక్కు పెళ్లిచేసింది. పాపం! మా నాన్న ఆసంబంధం కాకుండా చేయాలని తన శాయశక్తులా ప్రయత్నించి విఫలమనోరథుడైనాడు. పెండ్లికికూడా నేను వెళ్లనోచుకోలేకపోయాను. నేనుకూడా పెళ్లికి వస్తే నలుగురిలోనూ తన కోడలని చెప్పకోటానికి నామోషీ అని ఆమె నన్ను రానియ్యలేదు. పైగా నీలాంటి హృదయం గలవాళ్లు “బంగారు బొమ్మలాంటి కోడలుండగా మళ్లీ పెళ్లెందు” కని ప్రశ్నిస్తే నేను గొడ్డుదాననని, నాకు మాతృస్థానం ఆక్రమించుకొనే అర్హత లేకపోబట్టే నాయిష్టంమీద కొడుక్కు పెళ్లి చేస్తున్నాననీ చెప్పేది.

“బాబూ! స్త్రీ హృదయాన్ని నువ్వు కాదుగదా చివరకు భగవంతుడన్నా గ్రహించలేడు. వాళ్ల హృదయాన్ని దారుణ సంతాపానలం దహించి వేస్తున్నా తమ సహనశక్తిచేత తమ హృదయంలోని దారుణ బాధను వారు చివరకు కన్నతల్లికైనా తెలియనియ్యరు. నన్ను ఎవరైనా “ఈపెళ్లికి నువ్వు యిష్టపడ్డావా?” అని ప్రశ్నిస్తే నేను యథార్థం చెప్పగలనా? అందుకు నా హృదయం అంగీకరిస్తుందా? నేను ఒక్కత్తెనే ఆరోజు విలపించిన విలాపం, నా కన్నులనుండి వెడలిన వేడి అశ్రుప్రవాహం ఆ పరమాత్మ ఒక్కడే గుర్తించాడు. మా నాన్న నా దురవస్థకు బెంగపడి మంచంపట్టాడు. చివరకు అతడు ఆమంచంమీదే నాకోసం దుఃఖిస్తూ ప్రాణాల్ని వదిలాడు. ఆఖరుసారి అతడి చూపులకుకూడా నోచుకోలేకపోయాను నిర్భాగ్యురాల్ని” అని, జలజలమని రాలుతూవున్న అశ్రువులను పమిటచెంగుతో తుడుచుకుంది.

ఆమె చెప్పే విషాదగాథను వింటూ అంతకుముందే నిండివున్న బిందెలోకి నేను తోడిన నీళ్లు పోసేస్తున్నాను. ఆ నీళ్లు క్రిందకు పొర్లిపోతూ వుండటం నా అశ్రుపూరితనయనాలు గుర్తించలేదు. అలా ఎన్ని చేదలు వ్యర్థమైనాయో?

ఆమె సంగతంతా గ్రహించి బిందె నెత్తుకుని వెళ్లిపోయింది. నేను అచేతనుణ్ణయి అలాగే కూర్చుండిపోయాను. ఆమె మళ్లీ వచ్చింది. తక్కిన సంగతి చెబుతుందేమో అని ఆశాపూరిత నయనాలతో నిరీక్షిస్తున్నాను. కాని ఆమె బిందెనెత్తుకొని “తమ్ముడూ! వాళ్లు రెండో ఆటకు సినిమాకు వెడతారట. ఇంటికి నేను కాపలా వుండాలి. రేపు తక్కిన గాథ విందువుగాని” అంటూ వెడలిపోయింది. ఆమెకు కావల్సిన నీటిని తోడగానే నా బిందె నెత్తుకొని నిస్పృహతో యిల్లు చేరుకున్నాను.

ఆమరునాడు ఆమె మిగిలిన గాథను యిలా చెప్ప మొదలిడింది.

"తమ్ముడూ! మా నాన్న చనిపోగానే అప్పుల వాళ్లు మాయిల్లు స్వాధీనపరచుకున్నారు. మా అమ్మ 'నా' అనేవాళ్లు లేని ఏకాకిని అయిపోయింది. వృద్ధాప్యంలో నన్నా ఆమెను దగ్గరకు చేరదీసి ఆదరించ వీలులేకపోయింది. పూర్తిగా జవసత్వా లుడిగిన ఆమె జీవనం ఎలా చేయగలదు? వొంట్లో ఓపిక లేకపోయినా ఏలాగో ఒకరియింట్లో వంటకు కుదిరి జీవితం గడుపుతుండేది. కనిపెంచిన ప్రాణం గనక అప్పుడప్పుడు వుండబట్టలేక నన్ను చూడటానికని ఏదో ఒక చీరా, రవికా అంటూ పట్టుకొనివచ్చేది. కాని ఏమి లాభం? మా అత్తగారు ఆమెను నోటికి వచ్చినట్లు తిట్టి, గుమ్మం ఎక్కనిచ్చేది కాదు. కిక్కురు మనకుండా పక్కవారింట్లో వుండి నన్ను పిల్చి తాను తెచ్చినవి నా కిచ్చి, నన్ను కౌగలించుకొని నా దౌర్భాగ్యానికి వలవల ఏడుస్తూవుండేది. ఆమెదుఃఖాన్ని యినుమడిస్తుం దనే భయంతో నా హృదయంలోని బాధను అణుమాత్రమైనా ఆమెఎదుట వెల్లడించేదాన్ని కాదు.

"బాబూ! నాకష్టాలు వెల్లడించాలంటే మాటలు చాలవు. మా అత్తగారు కొంత విద్యావంతురాలు, సర్వస్వతంత్రురాలు. ఈ వూళ్లోని మహిళామండలి కామె స్థాపకురాలు, అధ్యక్షురాలు. నా చెల్లెలు దానికి కార్యదర్శిని. పురుషులతో సమానమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు స్త్రీలకు కావాలని ఎన్నో ఉపన్యాసా లిస్తూవుంటుంది. నా చెల్లెలు స్కూలుఫైనలు ప్యాసయింది. ఫ్యాషన్లలో, అభిరుచులలో అత్తగారికంటె రెండాకులు ఎక్కువే చదువుకుం దని చెప్పాలి. ఆమెకు స్త్రీపురుష వివక్షత లేదు. వాళ్లిద్దరూ యింట్లో ఒకపనన్నా ముట్టుకోరు. ఎల్లప్పుడూ పత్రికలు చదవటం, క్లబ్బులకు పోవటం, సినిమాలు చూడటంతోనే జీవితాలు గడుపుతారు. ఇంటి చాకిరీ అంతా నేనే చెయ్యాలి. నాకు చదువు రాదు, మర్యాద తెలియదు అని అస్తమానం అత్తగారు నన్ను సాధిస్తూ ఉంటుంది. నిజానికి నేనుమాత్రం చదువురాని మూర్ఖురాల్ని కాను. భారత, భాగవత, రామాయణ గ్రంథాలనూ, తెనుగు పేపర్లనూ బాగా చదివి అర్థం చేసుకో గలను. కాని ఇరవైనాలుగుగంటలూ యింటిపనులతో మునిగి తేలుతూవున్న నాకు తీరుబడి ఏదీ? ముఖ్యంగా ఆమెకు నాపై గల క్రోధానికి కారణం ఏమంటే — ఇంటికి వచ్చిన ప్రతిమగాడితోటీ స్వేచ్ఛగా, చనువుగా, సిగ్గువిడిచి మాట్లాడా లంటుంది. నా చెల్లెలువలె పురుషులతో కలసిమెలసి తిరుగుతూ వారితో టెన్నిసు ఆడుతూ, సినిమాలకు వెళ్లాలంటుంది. ఇదెక్కడి న్యాయం! ఇదెక్కడి నాగరికత! మానాభిమానాలకు పుట్టినిల్లయిన భారత రమణి కిలాంటి పాపపుచర్యలు కూడునా? తమ్ముడూ! ఈ విషయంలో నన్ను చిత్రవధ చేసినప్పటికీ నేను అలా సంచరించటానికి సుతరామూ అంగీకరించను. భారతనారీమణికి పతియే దైవము, శీలమే ఆమెకు శిరోభూషణము. ఆమె పతిసేవ వలననే అత్యంత సులభంగా ముక్తి పొందుతుందనే దృఢ నమ్మకంతోనే, వీళ్లింత క్రూరంగా బాధిస్తూవున్నా, ఓరిమితో సహించి వున్నాను.

"ఇప్పుడు నాగరికులకు అనాగరికులను చూస్తే అంత ఈర్ష్యా, అసహ్యమూ కలగటానికి కారణమేమిటో వూహించ లేకుండావున్నాను. నా చెల్లెలు నన్నొక బానిసకంటే హీనంగా చూస్తుంది. ఆమె ఆజ్ఞాపించినట్లు నేను నడుచుకోవాలి. ఏ మాత్రం ఆలస్యంచేసినా అత్తగారు మండిపడి చీపురుతో, లేకపోతే చేతికర్రతో నాశరీరాన్ని హూనం చేసివేస్తుంది. ఇలాంటి దెబ్బలతో నాశరీరం కాయలు తేరిపోయిందంటే నమ్ము. ఈ చాకిరీకీ, ఈ దెబ్బలకూ నా ఆరోగ్యం పూర్తిగా నాశనమై ఉబ్బసపువ్యాధి అంకురించింది. ఆ బాధ అనుభవించేవాళ్లకు తప్ప మరొకళ్లకు తెలియదు. వీటి కేమీ విచారించేదాన్ని కాను. కాని నావలన సౌఖ్యములేని నానాథుడికి నాచెల్లెలి వలనకూడా తగిన ఆదరణ జరగటం లేదనే విచారం నా హృదయాన్ని వేధిస్తూవుంది. మా అమ్మ ఆరునెలల క్రింద తీర్థయాత్రలకని బయలుదేరి వెళ్లింది. కాని యింతవరకూ ఆమెక్షేమసమాచారం ఆవంతైనా

తెలియలేదు. నాయందలి విచారంతో ఆకాస్త ప్రాణాన్నీ ఏ గంగాస్రవంతి కర్పించిందో" అని బాష్పధారలతో ఆ నాటికి తన చరిత్రను ముగించింది.

ఆ రాత్రంతా నిద్రపోకుండా ఆమె చరిత్రను గూర్చి విమర్శించటంతో గడిపాను. స్త్రీ జాతిలో కూడా యింత పాషాణ హృదయలు వున్నారా అనిపించింది. సామాన్యంగా మూఢాచారాలకూ, అవివేకానికీ లోనైన కొందరు స్త్రీలు కోడంట్రికం పెడుతూవుండటం చూశాను గాని కేవలం విద్యావతియు, వివేకవంతురాలును, స్త్రీ స్వాతంత్ర్యకాంక్షిణియు అయిన వొకవ్యక్తి మాత్సర్యంతో, స్వార్థంతో సాటి అబలను యింతదారుణంగా బాధిస్తుందని ఎన్నడూ కని, విని, చివరకు వూహించికూడా ఎరగను. తుచ్ఛమైన ధనంకోసం కోమలాతికోమలమైన ఒక అబల అమూల్య జీవితాన్ని యింతక్రూరంగా హింసిస్తూవున్న ఆమెను సంఘం ఒక భయంకరనారీపిశాచిక్రింద పరిగణింపక ఎందుకట్లు గౌరవించి పూజిస్తూవుందా అని ఆశ్చర్యపోయాను.

ఇలా ఒక యిరవై రోజులు గడిచిపోయినవి. చీకటి రాత్రులు. ఆకాశంలోని నక్షత్రాలు మినుకు మినుకుమంటూ గ్రుడ్డివెల్తురు నిస్తున్నాయి. మునిసిపలు దీపాలు నామమాత్రావశిష్టంగా వెలుగుతూ, ఈ నిముషానికో మరునిముషానికో కొండెక్కేటట్టున్నాయి. నేను మా అక్కయ్యకోసం నిరీక్షిస్తున్నాను. ఆమె అతిప్రయాసతో వచ్చి నన్ను చూడగానే భోరున ఏడ్చింది. నా హృదయం బేజారైంది. ఆమెను బుజ్జగిస్తూ "అమ్మా! ఎందు కలా ఏడుస్తావూ? జరిగిన సంగతేమిటో చెప్పు" మని తొందర పెట్టాను. అందుకామె ఏడుస్తూనే యిలా చెప్పింది.

"బాబూ! ఇక నాకీప్రపంచంలో బ్రతకాలనే ఆశ లేదోయి. కన్న తలిదండ్రులా, కరవైపోయారు. నా జీవితానికి ఆధారభూతుడైన నాథునికా, నాపై అభిమానం లేదు. తల్లికంటే మిన్నగా ఆదరించవలసిన అత్తగారిట్లయింది. ఇక ఏ ఆశతో బ్రతికి వుండమంటావు చెప్పు. నేడు జరిగిన సంఘటనను తలుచుకుంటే నాహృదయం చెరువై పోతుంది.

"ప్రొద్దున చెల్లెలికి జుట్టు దువ్వి తలంటుతున్నాను. పొరపాటున పులుసు ఆమెకంట్లో పడిందో లేదో చెప్పలేను. ఆపళంగా ఆమె తారాజువ్వవలె లేచి నాదవడపై నాల్గుదెబ్బలు వేసి, నేను తన్ను చంపేస్తున్నానని కేకలువేస్తూ అత్తగారితో చెప్పింది. ఆమెయందు నాకు అణుమాత్రమైనా ద్వేషం లేనప్పుడు నేనలాంటి పని చేస్తానా? నేను నిలువునా నీరైపోయి నిలుచున్నాను. మూర్తీభవించిన చండికవలె అత్తగారు రౌద్రంతో చేతిలోని బెత్తాన్ని ఝూడించుకొంటూ వచ్చి "దౌర్భాగ్యురాలా! నిన్నింతలో వుంచినప్పుడే నీ పొగరు కట్టుపడలేదూ? బంగారంలాంటి పిల్లకళ్లను పాడుచేయా లనుకున్నావా? దీని తెలివి తేటలూ, సుగుణసంపదలూ చూచి నీ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నావా? దాసీముండకంటే కనాకష్టమైన నీ బ్రతుకి క్కింత గర్వమా?" అంటూ ఎత్తిన బెత్తాన్ని దించకుండా నాశరీరాన్ని హూనంచేసింది. నా చెల్లెలు నన్ను తిట్టిన తిట్లకు లెక్కలేదు. మామగారు వూళ్లో లేరు. ఆయన పరీక్షలకు మద్రాసు వెళ్లారు.

"చావుదెబ్బలు తిని కొన ఊపిరితో పడివున్న నన్ను చూచన్నా ఆమె కసి తీరలేదు. పైగా నన్ను ఎంత బాధించినా నేను గట్టిగా కేకలు వేసి అల్లరి చేయననే ధైర్యము. వాళ్లిద్దరూ నా చేతులూ, కాళ్లూ బిగించి కట్టివేశారు. మా చెల్లెలు నన్ను అదిమిపట్టుకుంది. నేను కిక్కురు మనలేదు. మా అత్తగారు అంతకుముందే ఎర్రగా కాల్చివుంచిన అట్లకాడను పట్టుకొని వచ్చింది. తమ్ముడూ! అప్పటి భీకరదృశ్యం చూడగానే నాప్రాణాలు ఎగిరిపోయాయి.

"హృదయం లేని నా అత్తగారు నాచీరను తొడలవరకూ తొలగించింది. ఆ కాలుతూవున్న అట్లకాడ నా రెండు తొడలమీదా అంటించింది. 'కెవ్వు' మని బాధలో కేకవేశానని జ్ఞాపకం. కాని మా చెల్లెలు నా నోటిని గట్టిగా నొక్కివుంచటంలో అదీ

ప్రపంచకానికి వినిపించి వుండదు. అలాగే కళ్లు మూశాను..."

ఆమె ఆయాసంతో నాల్గునిముషాలు మాట్లాడ లేకపోయింది. తీవ్రమైన బాధతో దగ్గింది. ఆయాస పడుతూ మళ్లా మొదలు పెట్టింది.

"కళ్లు తెరిచేటప్పటికి పన్నెం డవుతుంది. ఆపూటకు నే నెలాగూ వండననుకొని హోటలునుంచి భోజనం తెప్పించుకుని యిద్దరూ తినివేసి మంచా లెక్కి పేపర్లు చదువుకుంటున్నారు. కట్లు తప్పించి వుండటంచేత అతిప్రయాసమీద లేచి కూర్చున్నాను. రెండు తొడలమీదా ఆరు అంగుళాల పెద్ద మచ్చలు బొబ్బలుదేరి కనిపించాయి. వానిని చూడగానే ఎక్కడలేని దుఃఖమూ ముంచుకొచ్చింది. పెదవిని మెదపకుండానే నా తల్లి దండ్రుల్నీ, నా కష్టాలనూ తలపోసుకొని అరగంటవరకూ భోరున ఏడ్చాను. శరీరంలోని నీరంతా కన్నుల్లోంచి వెళ్లిగక్కేశాను. ఇక నెత్తురుచుక్కలు మాత్రం రావలసివుంది. కాని అదికూడా యీదెబ్బల్లో నీటిరూపం దాల్చటంచేత వాటిని చూచే అదృష్టం పట్టలేదు.

"ఆబొబ్బలు రెండూ చురచుర మంటూ దేహ మ్నంతా మండించేస్తున్నాయి. ఆకలిచిచ్చుకు ఆహారం పడకపోవటంచేత నీరసంతో శోష వస్తూవుంది. వోపిక లేకపోయినా అతి ప్రయత్నంతో వంటయింట్లోకి పోయి, అన్నంకోసం తడుము కున్నాను. ఆరోజున పొయ్యి అంటించనేలేదు. చివ రకు పాత్రలు నాకుదామన్నా ఒక్క మెతుకైనా మిగల్లేదు. నాలిక పిడచలు కట్టుతూ వుంటే రెండు గుక్కిళ్లు మజ్జిగ మాత్రం తాగాను. కడుపునిండా తిని, హంసతూలికాతల్పాలలో శయనించి, ఉల్లాసంతో పేకాడుతూవున్న ఆయదృష్టవంతులకు నేను మలమల మాడుతూ చావ సిద్ధంగా ఉన్న విషయం దృష్టియం దెందు కుంటుంది? గాయాలకుమాత్రం కొంచెం కొబ్బరినూనె రాసుకున్నాను. ఎవరిని వెళ్లి మంది మ్మని అడగను? ఈగాయాలు ఎందు కొచ్చా యంటే ఏమని సమాధానం చెప్పను? నా దురదృష్టాన్ని నిందించుకుంటూ, ఒకవంక గాయాలు బాధపెడుతూ ఉంటే, మరొకవంక ఆకలిమంట చురచురలాడుతూ వుంటే ఓర్చుకొని ఆ కటికనేలమీదే కొంగు పరచు కొని పరున్నాను.

"సాయంత్ర మవంగానే మళ్లా పనులు పురమా యించారు. కొనవూపిరితోనే వంటచేసి పెట్టాను. మళ్లా నీళ్లు తేకతప్పదని గద్దించటంచేత యిలా వచ్చాను. ఎంత గాయాలతో కరుడుకట్టిన శరీరమైనా కేవలం ఎప్పుడో చనిపోయినప్పుడు చితిలో కాల్చవల సినదానిని నిండుప్రాణంతో వుండగా కాలుస్తే నొవ్వ దూ? దేహమంతా భరించరాని మంటలు బయలుదేరు తున్నా మానం కప్పేందుకని యీచీర కట్టుకున్నాను గాని, అది ఈ పుండ్లను రేపుతూ పెట్టే బాధనుచూస్తే చీరను విప్పి పారేయా లనిపిస్తుంది. మధ్యమధ్య ఉబ్బ సంతో దగ్గటంలో నాప్రేవులు తెగిపోయేటట్టున్నాయి. ఎలాగూ చచ్చిపోయేముందుకు ముందుదండు గెందుకని మానేశాను. తమ్ముడూ! విన్నావా నా అభాగ్యజీవి తపుగాథ? నువ్వే చెప్పు, ఇలాంటి పరిస్థితుల్లో ఇం కే యాశతో బ్రతికి వుండమన్నావో! నాజీవితంలో యిలాంటి సంఘటన లెన్నో సంభవించాయి కాని అన్నిటికన్నా నేటివిషయమే నాజీవితమందు యింకా మినుకుమినుకు మంటూ వుండే ఆశాజ్యోతిని పూర్తిగా ఆర్పివేయటంచేత నాబాధ నీతో చెప్పుకున్నాను" అని వెక్కివెక్కి యేడ్చింది.

ఒక్కసారి భయ సంభ్రమోద్రేకాలచే నా శరీరం కంపించిపోయింది. తోడుతూఉన్న చేదను నేల జారవిడిచి, పండ్లు పటపట కొరుకుతూ "తల్లీ! నీలాంటి సుగుణమణి ఆయమలోకంలో, ఆక్రూర రాక్షసుల నడుమ వుండకూడదు. ఇప్పుడే నాతో మాయింటికి వచ్చేయి. ఈ విషయమంతా పోలీసులకు ఎరుక పరచి, ఆ నరనారీరూప రాకాసిని క్రూరంగా శిక్షింపిస్తా. అంతవరకూ నా హృదయానికి శాంతి ఉండదు" అని ఆమెచేతిని పట్టుకొని లేవనెత్తాను.

అబ్బా! ఎంతవోర్పు! ఎంత అభిమానం!! నా చేతిని పట్టి బలవంతంగా క్రిందకు కూర్చుండబెట్టింది.

"తమ్ముడా! నీ అమృత హృదయాన్ని చూడగానే నా బాధంతా మాయమైపోయింది. కాని నువ్వు చేయదలచిన పనికి నా అంతరాత్మ అంగీకరించదు. స్త్రీ ఒకళ్ల చేతులోకి వెళ్లాక వాళ్లు ఎంత దారుణంగా బాధించినా, చంపినా, ఓర్పుతో సహించి, తన జీవితాన్ని అత్తింట్లోనే బలిదానం చేయటం భారతనారీమణిధర్మం. కాని ఎన్నటికన్నా నశించే యీ పాడు శరీరంమీద మమకారమంచుకొని, కట్టుదప్పి యితరుల గృహాలలో వుండటం ఆమె జీవితానికి తీరని కళంకం కాదూ? బాబూ! నువ్వు ఆగ్రహపడకు. నువ్వు వాళ్లను నలుగురిలోనూ అల్లరిపెట్టి నన్నేమన్నా సుఖపెట్టగలవా? నీకే గనుక నాయందు నిర్మలమైన అనురాగం వుంటే యీ విషయం ప్రపంచానికి వెల్లడి చేయకు" అని ప్రార్థనాపూర్వకంగా చెప్పింది.

ఆమె అంత దీనంగా వొద్దని వారిస్తూవుంటే ఏం చెయ్యను? నాలోని వుద్రేకాన్నంతా అతి ప్రయత్నంతో అణుచుకోవాల్సి వచ్చింది. ఆమె బిందెను అతి ప్రయాసమీద ఎత్తుకుంది. కాని అడుగులు తడబడుతున్నాయి. చూడలేకపోయాను.

"అమ్మా! యివ్వాళ నీళ్లు పట్టుకొని వెళ్లటానికి సాధ్యం కాదు. మీ యింటిదాకా బిందెను నేనే ఎత్తుకొని వస్తా" నన్నాను.

అంతబాధతోనూ ఆమె ఒక అపూర్వమైన చిరునవ్వు నవ్వి "బాబూ! ప్రపంచంలో నీలాంటి అమృతహృదయాలు చాలా కొద్దిగా వుంటాయి. నువ్వు అలా చేస్తే నన్ను మరీ సంకటపరచినవాడవవుతావు. మావాళ్లు చూశారంటే నన్ను నిలువునా చీరేస్తారు. ఒకవేళ వారికంట పడకపోయినా పాడులోకం యిట్టే మనకు అపవాదు అంటగట్టేస్తుంది. ఇంట్లో వాళ్లు ఎంత క్రూరంగా హింసించినా సహించగలంగాని నిజానిజాలు గమనించకుండానే అపవాదులు పుట్టించి నిందించే లోకుల మాటలు భరించటం దుర్భరం. ఈ విషయంలో నువ్వేమీ కలగజేసుకోవ"ద్దని వారించి వెళ్లిపోయింది. నే నేం చేయగలను?

ఆమె లోకంసంగతి ఎత్తగానే నాసర్వావయవాలూ క్రోధోద్రేకంతో మండిపోయాయి. వెధవలోకం!— తల్లీకొడుకూ, తండ్రీకూతురూ, అన్నాచెల్లెలూ ఎక్కడన్నా వంటరిగా మాట్లాడుకోవటం చూచిందంటే — గ్రుడ్డిలోకం! — ఒకక్షణమన్నా వివేకంతో ఆలోచించకుండా వాళ్లిద్దరికీ యిట్టే అపవాదు కట్టి లోకంలోని ప్రతిప్రాణికీ పనిగట్టుకొని చాటుతుంది.

ఇలా మరో యిరవై రోజులు గడిచిపోయాయి. నేను వచ్చిన వేళావిశేషం మంచిదవటంచేత మా అమ్మ పూర్తిగా ఆరోగ్యవంతురాలైంది. ఇంకొకవారం రోజుల్లో ఆమెను తీసుకొని స్వగ్రామానికి పోదామనుకుంటున్నాను. పాపం! ఆమె దినదినమూ ఆ క్రూరరాక్షసుల చేతుల్లో పడి చిక్కి శల్యమైపోతూవుంది. ఆరోజు నా దుడుకుతనాన్ని చూచి తాను పడే బాధలన్నీ నాతో చెప్పకుండా హృదయంలోనే అణచుకొని క్రుళ్లుతూవుంది. ఆమె యిష్టపడనప్పుడు ఆమె విషయంలో నే నెట్లు కలగజేసుకోను?

నేను త్వరలో వెళ్లిపోతానన్న సంగతి గ్రహించినంతనే ఆమెలోని దిగులు హెచ్చుతూవచ్చింది. జీవితంమీద ఏమాత్రమూ మమకారం లేనట్లు మాట్లాడేది. నేనుమాత్రం ఆమెను హెచ్చరిస్తూ వుండేవాణ్ణి.

స్నేహితుడి పెళ్లికి రావలసిందని అర్జంటుగా టెలిగ్రాము రాగానే నేను నెల్లూరుకు వెళ్లిపోయాను. ఈ విషయం మాఅక్కయ్యతో చెప్పటానికి అవకాశం లేకపోయింది. పాపం! ఈరెండు రోజులూ ఆమెకు ఎవరు సాయం చేస్తారని పరిపరివిధాలుగా ఆలోచిస్తూ స్నేహితుడెంత బతిమాలినా వినకుండా మూడోరోజు రాత్రే బయలుదేరాను. బండి దిగగానే ఆనూతిదగ్గర నుంచే మాయింటికి వెళ్తున్నాను. జనం నూతిదగ్గరకు హడావిడిగా పరుగెత్తుతున్నారు. వాళ్లు మాట్లాడుకోవటంలో ఫలానావారికోడలు క్రితను రాత్రి నూతిలో పడి చనిపోయిందనేమాట చలిపిడుగులాగు చెవిని పడగానే నేను నిలువునా నీరైపోయాను. భయ, శోకోద్రేకాలు నా సర్వావయ

వాలనూ కదలనివ్వకుండా చేసినా అతిప్రయత్నంతో ఆప్రదేశాన్ని చేరుకున్నాను.

ఆ నూతిదగ్గర వందలకొలదీ జనం గుమిగూడి ఎవరికి తోచినట్లు వారు చెప్పుకుంటున్నారు. పిచ్చివానిలా ఆగుంపును వొత్తిగించుకొని చూశాను. ఏపనైతే జరుగుతుందని నేను భయపడ్డానో, ప్రతిక్షణమూ ఆమె పెదవుల్లోంచి ఏకోరికైతే బయటకు వచ్చేదో చివరకు అదే జరిగింది.

నిర్భాగ్యురాలు! తన శరీరంలోని తుదినెత్తురు బొట్టునూ, తన జీవితానందాన్నీ, తన సర్వసుఖాల్నీ, తుదకు తనప్రాణాల్నీ కూడా ఆ నరరూప నారీ పిశాచాలకు బలి గావించి దీర్ఘనిద్ర పోతూవుంది. ఆమె నిరుపమాన సహనశక్తే ఆమె జీవితకుసుమాన్ని నేలరాచివైచింది. ఆమొహంలో నిరుపమాన శాంతరసం వొలుకుతూవుంది.

నాకళ్లు గిర్రుమని తిరిగాయి. ఇక అక్కడ వుండలేకపోయాను. సిల్కు కండువాను మొహంమీద కప్పుకొని చెరువుగట్టుమీద వొంటరిగా కూర్చుని నా హృదయం పగిలేటట్టుగా ఏడుస్తున్నాను. అలా ఎంతసేపు ఏడ్చానో నాకే తెలియదు.

ఆశవందగ్గర మొసలికన్నీళ్లను విడుస్తూవున్న ఆరాక్షసులను చూచి,—ఆమె ఉబ్బసపుబాధ భరించలేక ఆత్మహత్య చేసుకొందని నిర్ణయించారు పంచాయతీదార్లూ, లోకమూను.

